క్లుప్తంగా

కాల్వల్లో పూడిక తీయించాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పాలకుర్తి టౌన్: పాలకుర్తి నియోజకవర్గంలో రైతుల పంట పొలాలకు సాగునీరు అందించేందుకు కాల్వల్లో పూడిక తీత పనులను చేపట్టాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కోరారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో శనివారం జీరో అవర్‌లో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడారు. దేవాదుల కాల్వను తవ్వి ఏళ్లు గడుస్తున్నప్పటికీ వాటిల్లో పూడికతీయించడంలో 10 సంవత్సరాలు నిర్లక్ష్యం చేశారని అన్నారు. కాల్వల ద్వారా రైతులకు సక్రమంగా సాగునీరు అందించాలనే సంకల్పంతో సొంత ఖర్చులతో పూడికతీత పనులు చేపట్టామని తెలిపారు. పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో ఏదైనా ఒక మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. పాలకుర్తి నియోజవర్గంలో ఇళ్లపై నుంచి 11కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయని, వాటిని తొలగించేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు.

బీఆర్‌ఎస్వీ నాయకుల అరెస్ట్



జనగామ: చలో అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో జనగామ పోలీసులు శనివారం బీఆర్‌ఎస్వీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. నాయకులు ఉల్లెంగుల సందీప్, ఇరుగు యాకన్న తదితరులను అరెస్ట్ చేసి, సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దాక నిరంతరం పోరాడుతామని, అరెస్టులు ఎన్ని చేసినా ఉద్యమాన్ని ఆపలేరని నాయకులు అన్నారు.

సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తోందని, రానున్న రోజుల్లో వారు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సభ్యులు మిన్నాలపురం ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. నాయకులు సుంచు విజేందర్, బెల్లంకొండ వెంకటేష్, బైరగోని బలరాం తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య



సోమయ్య (ఫైల్)

దేవరుప్పుల: భూవివాదం విషయంలో సొంత చెల్లెలు కోర్టుకు ఎక్కియడంతో మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు చెట్టుకు ఉరేసుకుని మృతి చెందిన ఘటన శనివారం రాజీవ్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై ఊర సృజన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంబోజీగూడెం జీపీ పరిధి రాజీవ్‌నగర్‌కు చెందిన చౌడం సోమయ్య (72)కు చెందిన వ్యవసాయ భూమిలో వాటా రావాలని అతని చెల్లె జెట్టి పుష్పలత కోర్టును ఆశ్రయించింది. 30 ఏళ్ల కిందట వివాహం చేసినప్పటికీ ఇప్పుడు తన ఆస్తిపై చెల్లెలు రాద్ధాంతం చేయడంతో తీవ్ర మనస్తాపం చెందేవాడని, ఈ విషయంలో జీవితంపై విరక్తి చెందిన సోమయ్య శనివారం గ్రామ సమీపంలో ఊడుగు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సంఘటన స్థలాన్ని చూసిన స్థానికుడు రాంపల్లి వెంకన్న మృతుడి కూతురు శాతరాశి హైమావతికి తెలియజేశాడు. అక్కడి ఆమె చేరుకుని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. ఈ నెల 20వ తేదీన దేవరుప్పుల చౌరస్తాకు మండల కేంద్రానికి చెందిన తోటకూరి యాదయ్య(70) సొంత పనిమీద సైకిల్‌పై వస్తుండగా వెనుకాల నుంచి యాదాద్రిభువనగిరి జిల్లా రాపాకకు చెందిన గొలుసుల తిరుమలేష్ వరికోత మిషన్‌తో వచ్చి ఢీకొట్టాడు. ఘటనలో యాదయ్య రెండు కాళ్లకు తీవ్ర గాయాలై అపస్మారక పరిస్థితిలోకి వెళ్లడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొడుకు రామచంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

‘ఆర్‌యూబీ’కి తొలగిన అడ్డంకులు

● భూమి కొనుగోలుకు నిర్ణయం
● చదరపు గజానికి రూ. 6 వేల చొప్పున
● చొరవ తీసుకున్న మూడు గ్రామాల పెద్దలు
● నిడిగొండ వైపు 26 అడుగుల వెడల్పుతో ఆర్‌యూబీ



భూ యజమానులతో ఒప్పందం చేసుకుంటున్న గ్రామాల పెద్దలు

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ రైల్వే ట్రాక్ వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణానికి అడ్డంకులు తొలగాయి. భూసేకరణకు ప్రభుత్వ విభాగాలు చేతులెత్తేసిన వేళ.. నిడిగొండ, ఇబ్రహీంపూర్, ఫతేషాపూర్ గ్రామాల పెద్దలు గంగిడి నర్సింహారెడ్డి, లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, గొట్టం భాస్కర్‌రెడ్డిలు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శనివారం భూ యజమానులతో మాట్లాడి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకు గాను చదరపు గజానికి రూ. 6 వేల చొప్పున దాదాపు 220 గజాలు (రెండు గుంటలు) కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు రూ.12 లక్షలకు పైగా చెల్లించాల్సి ఉంది. రూ.లక్ష అడ్వాన్స్‌గా ఇచ్చారు. 45 రోజుల్లో మిగతా మొత్తం చెల్లించాలని ఒప్పందం కుదుర్చుకున్నారు.

26 అడుగుల వెడల్పుతో ..

రైల్వే ట్రాక్ వద్ద గేటు పడుతుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అత్యవసర సమయాల్లో సకాలంలో ఆస్పత్రికి వెళ్లలేక కొందరు మరణించిన ఘటనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి ఆటంకం లేకుండా వాహనాలు రాకపోకలు సాగేలా ఏడాది క్రితం ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టారు. ఫతేషాపూర్ వైపు అండర్‌గ్రౌండ్‌లో 32 ఫీట్ల వెడల్పుతో నిర్మించగా,, నిడిగొండ వైపు కేవలం 20 ఫీట్ల వెడల్పుతోనే పనులు చేపట్టారు. దీంతో ఈ నెల 18వ తేదీన ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, లక్ష్మితండా, రామచంద్రగూడెం, మాధారం గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ఆర్‌యూబీ వద్దకు తరలి వచ్చి నిరసన చేపట్టారు. ఇరువైపులా ఒకే విధంగా ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టాలని రైల్వే అధికారులతో వాగ్వాదం చేశారు. పోలీసులు చేరుకుని ఆందోళన విరమింపజేశారు. భూ యజమానులు స్థలం ఇచ్చేందుకు నిరాకరించడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. దీంతో రంగంలోకి దిగిన మూడు గ్రామాల గ్రామ పెద్దలు గంగిడి నర్సింహారెడ్డి, జగదీష్‌చందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి శనివారం అయా గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులతో నిడిగొండకు చేరుకున్నారు. అక్కడ భూ యజమానులు మడ్లపల్లి రాధాకృష్ణ, కొలిపాక రాజ్‌కుమార్, శ్రీకాంత్‌లతో సమావేశమై ఆర్‌యూబీలో కొల్పోయే భూమికి తామే పరిహారం ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో నిడిగొండ వైపు 26 ఫీట్ల వెడల్పుతో ఆర్‌యూబీ నిర్మాణానికి మార్గం సుగమమైంది.

ఇంకొన్నాళ్లు గేటు తెరిచి ఉంచేలా..

ఆర్‌యూబీ నిర్మాణం తుది దశకు చేరిన నేపథ్యంలో కాంట్రాక్టర్‌కు ఇచ్చిన అగ్రిమెంట్ ప్రకారం గేటు పూర్తిగా మూసి వేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. మరి కొన్ని రోజులు గేటు తెరిచి ఉంచేలా చూడాలని కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలని అయా గ్రామాల ప్రజలు భావిస్తున్నారు. త్వరలో కలెక్టర్‌ను కలువనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండీ హయతలి, బిర్రు నర్సింహులు, శాగ నాగరాజు, గాజులపాటి వీరోజీ, పోకల శ్రీనివాస్, చింత నరేష్, ఎండీ షబ్బీర్, గొట్టం కర్ణాకర్‌రెడ్డి, ఎండీ యాకుబ్, గాజులపాటి నేతాజీ, మేడిపల్లి నరేష్, దొరగొల్ల గట్టయ్య, పండుగ ప్రేమ్, జోగు శ్రీధర్, బి.రాములు, లోడె నర్సయ్య, తిరుపతి, చింత పోశయ్య, నర్సింహులు, యాదగిరి ఉన్నారు.

పరీక్ష కేంద్రాల సందర్శన



ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని పలు పదో తరగతి పరీక్ష కేంద్రాలను స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న తహసీల్దార్ వెంకటేశ్వర్లుతో కలిసి శనివారం సందర్శించారు. ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్, హోలీక్రాస్ స్కూల్, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంటర్లలో పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లు, విద్యార్థులకు ఏర్పాటు చేసిన తాగునీరు తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా సెంటర్ల ఇన్‌చార్జ్‌లతో మాట్లాడారు. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని, విద్యార్థులకు సరైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే మా దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన ఆరు గ్యారంటీల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో శనివారం సీపీఎం గ్రామ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్, నాయకులు కొడెపాక యాకయ్య, వంగపండ్ల సోమయ్య, కత్తుల రాజు, తొడెంగల ఐలయ్య పాల్గొన్నారు.

అర్హులకు రేషన్‌కార్డులు, ఇళ్లు ఇవ్వాలి

రఘునాథపల్లి: అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు, ఇళ్లు, పెన్షన్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని నిడిగొండలో సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తుల సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు నామాల గిరి, వంగాల ఎల్లేష్, పూస నర్సింహులు, తూడి ఐలయ్య, బండారి యాదగిరి, గోపగోని వెంకటేశ్వర్లు, మేకల యాదగిరి, లింగాల రవి, నరేష్ పాల్గొన్నారు.

పాలకుర్తి: అర్హులకు రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య డిమాండ్ చేశారు. మండలంలోని ఈరవెన్ను గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇంటింటా సర్వే నిర్వహించారు.

నిరంతర విద్యుత్‌కు కృషి



నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డీఈ లక్ష్మీనారాయణరెడ్డితో రైతులు

బచ్చన్నపేట: గృహ, వ్యవసాయ వినియోగదారులకు వేసవి కాలంలో ఎలాంటి సమస్యలు రాకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామంలో ఓ రైతు వ్యవసాయ బావి వద్ద అమర్చిన నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఆయన ప్రారంభించారు. ఏడీఈ వేణుగోపాల్, ఏఈ రాజ్‌కుమార్, ఎస్ఎల్ఐ సారయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ బాల్‌రాజు, కాంట్రాక్టర్ మూసిని భానుచందర్‌గౌడ్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

క్రషర్‌కు విద్యుత్ లైన్ వేయొద్దు

ట్రాన్స్‌కో ఏడీఈకి గ్రామస్తుల విజ్ఞప్తి



ఏడీకి విజ్ఞప్తి చేస్తున్న గ్రామస్తులు

రఘునాథపల్లి: గ్రామానికి నష్టం చేకూర్చే అనంతరాయి గుట్ట క్రషర్ నిర్వహణకు విద్యుత్‌లైన్ వేయొద్దని మండలంలోని మాదారం గ్రామస్తులు శనివారం ట్రాన్స్‌కో ఏడీ అనిల్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. మాధారం–ఇబ్రహీంపూర్ మధ్యలో ఉన్న అనంతరాయి గుట్టకు ఉన్న క్రషర్‌కు 11 కేవీ విద్యుత్ లైన్ పనుల కోసం క్రషర్ యజమాని ట్రాన్స్‌కోకు డీడీ సొమ్ము చెల్లించారు. లైన్ మంజూరు కాగా ఇటీవల కాంట్రాక్టర్ 11 కేవీ విద్యుత్ లైన్‌కు స్తంభాలు నాటేందుకు యత్నిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్న విషయం విదితమే. పనులు ప్రారంభించేందుకు శనివారం ఏడీ, ఏఎల్ఎం ఉపేందర్ నిలిచిపోయిన పనుల వద్దకు చేరుకుని పరిశీలిస్తుండగా గ్రామస్తులు అక్కడికి చేరుకుని క్రషర్‌తో కలిగే నష్టాలపై గోడు వెళ్లబోసుకున్నారు. క్రషర్‌లో బ్లాస్టింగ్‌ల కారణంగా బోరు బావులు కూరుకు పోతున్నాయని, ఇళ్ల బీటలు వారుతున్నాయని, విద్యుత్ లైన్ ఇవ్వకూడదని కోరారు. దీంతో సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు వెనుదిరిగారు. ఏడీకి విజ్ఞప్తి చేసిన వారిలో మాజీ సర్పంచ్ గుడి రాంరెడ్డి, మహేందర్ రెడ్డి, సమ్మయ్య, రేసు కుమార్; రాజేందర్, రాజు, హరీష్, అనిల్ శ్రీను తదితరులు ఉన్నారు.

‘ఇందిరకు సముచిత స్థానం కల్పించాలి’



మాట్లాడుతున్న భిక్షపతి

స్టేషన్‌ఘన్‌పూర్: కష్టకాలంలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి జీవం పోసిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరకు పార్టీ అధిష్టానం సముచితస్థానం కల్పిస్తూ కేబినెట్ హోదాతో నామినేటెడ్ పోస్టును ఇవ్వాలని ఇందిర వర్గీయులైన నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు సింగపురం దయాకర్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు కొత్తపల్లి భిక్షపతి, చేపూరి రాజశేఖర్ మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నియోజవర్గంలో కాంగ్రెస్‌కు గడ్డుపరిస్థితులు ఉన్న సమయంలో సింగపురం ఇందిర పార్టీకి, పార్టీ శ్రేణులకు అండగా నిలిచిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలోకి వస్తే స్వాగతించామని, కాంగ్రెస్ పార్టీ నుంచి కడియం కావ్య గెలుపుకోసం శాయశక్తులా కృషి చేశామన్నారు. అయితే ప్రస్తుతం పాత కాంగ్రెస్ క్యాడర్ పరిస్థితి దుర్భరంగా ఉందని, అధికార పార్టీలో ఉన్నా ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పాత కాంగ్రెస్ క్యాడర్‌ను కడియం శ్రీహరి పట్టించుకోవడం లేదని, కడియ వెంట కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికే సముచితస్థానం కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కడియం తన వైఖరిని మార్చుకోవాలని, లేనిపక్షంలో గాంధీ భవన్‌కు, ఢిల్లీకి వెళ్లేందుకైనా సిద్ధమేనని హెచ్చరించారు. మాజీ ఎంపీటీసీ సింగపురం దయాకర్, జోగు రాంచంద్రం,యాదవరెడ్డి, నారగోని పద్మ, జోగు ప్రశాంతి, కండ్లకోల బాలరాజు, బత్తిని ఎల్లగౌడ్, సింగపురం ప్రతీష్, కోర్నెల్, మంద ఆరోగ్యం, భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

‘ఒకే దేశం.. ఒకే ఎన్నిక’తోనే అభివృద్ధి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

జనగామ రూరల్: ఒకే దేశం..ఒకే ఎన్నికతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. పట్టణ అధ్యక్షుడు అనిల్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక జూబ్లీ గార్డెన్స్‌లో ఒకే దేశం ..ఒకే ఎన్నికపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ దేశంలో పదే పదే ఎలక్షన్లు నిర్వహించడంతో రూ.లక్షల కోట్ల ప్రజాధనం వృథా అవుతోందని, ఒకేసారి ఎన్నికలు నిర్వహిచాలన్నారు. ప్రధాన కార్యదర్శి శివరాజ్, కన్వీనర్ పజ్జూరి లక్ష్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఎల్లయ్య, భువనగిరి పార్లమెంట్ కో కన్వీనర్ కొంతం శ్రీనివాస్, గుజ్జుల నారాయణ, మాజీ పట్టణ అధ్యక్షుడు పవన్ శర్మ, పట్టణ కన్వీనర్ గణపురం కార్తీక్ తేజ, కో కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు

నీటి వనరుల సంరక్షణ అందరి బాధ్యత



ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

చిల్పూరు: నీటి వనరుల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని బాలవికాస ప్రతినిధి విమల్ అన్నారు. లింగంపల్లి గ్రామంలో శనివారం ప్రపంచనీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శంకరయ్య అధ్యక్షతన విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి పొదుపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ ఏదునూరి రవీందర్, కండ్లకోలు బాలరాజు, కొంరయ్య, శ్రీనివాస్, మంజుల పాల్గొన్నారు.

కొమ్మూరి సత్యమ్మకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులతో ప్రతాప్‌రెడ్డి

జనగామ రూరల్/బచ్చన్నపేట/పాలకుర్తి: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తల్లి సత్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, శనివారం ఆమె దశదినకర్మను కుటుంబ సభ్యులు మద్దూరు మండలం సర్వాయిపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రముఖులు తదితరులు హాజరై సత్యమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి కొమ్మూరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, నాయకులు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

జనగామ రూరల్: ఏళ్ల తరబడి వెట్టి చాకిరి చేస్తూ ఇబ్బందులు పడుతున్న జీపీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బతుకమ్మకుంట ఆవరణలో జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు మట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 62 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో వారు వేతనాలు సరిపోక అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే జీతాలు పెంచి వారిని పర్మినెంట్ చేయాలని కోరారు.నారోజు రామచంద్రం, మల్లాచారి, బస్వ రామచందర్, వెంకటేశ్వర్లు, పి మల్లేష్, బాల్ నర్సయ్య, సిద్దయ్య ,సోమన్న పరంజ్యోతి, నాగరాజు పాల్గొన్నారు.

నియామకం

పాలకుర్తి టౌన్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్‌గా చెన్నూరుకు చెందిన మోలుగూరి యాకయ్యను నియమిస్తూ ఆ సంఘం చైర్మన్ చీమ శ్రీనివాస్, ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ నందగిరి రజనీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గ కన్వీనర్‌గా డానియల్

జఫర్‌గఢ్: తమ్మడపల్లి (ఐ) గ్రామానికి చెందిన రడపాక డానియల్‌ను తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కన్వీనర్‌గా నియమించినట్లు ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా డానియల్ మాట్లాడుతూ నియోజకవర్గ చైర్మన్‌గా నియమించినందుకు రాష్ట్ర చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గొడుగుల పంపిణీ

జనగామ రూరల్: హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో వివిధ కుడళ్లలో చర్మకార వృత్తిదారులకు దాతల సహకారంతో గొడుగులు పంపిణీ చేశారు. వేసవి దృష్ట్యా చర్మకారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు గొడుగులు అదజేసినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవి నాయక్ తెలిపారు. బొట్ల సుమతి, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి బదిలీ సహజం

తరిగొప్పుల: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి బదిలీపై వెళ్లడం సహజమని, వృత్తిపై అంకితభావంతో పనిచేయాలని సీఐ అబ్బయ్య అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో మూడు సంవత్సరాలు హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన మదబుషి శ్రీనివాస్ హైదరాబాద్‌లో విజిలెన్స్ విభాగానికి బదిలీపై వెళ్తున్నారు. కాగా, శనివారం సీఐ అబ్బయ్య, ఎస్సై గుగులోత్ శ్రీదేవి, సిబ్బందితో కలిసి ఆయనను సన్మానించి వీడ్కోలు పలికారు.

జయప్రదం చేయండి

నర్మెట: జిల్లా కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్స్‌లో యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 28న తలపెట్టిన యాదవ శంఖారావానికి యాదవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సమితి జిల్లా అధ్యక్షుడు తాటికొండ వెంకటేష్, కోశాధికారి నక్కల రవి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక యాదవ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల ఉపాధ్యక్షుడుగా గోగు రాజు, నర్మెట గ్రామశాఖ అధ్యక్షుడుగా ఎర్రబోయిన రాజు, ఉపాధ్యక్షుడిగా దొండకాయల కుమార్, కార్యదర్శిగా కన్నెబోయిన కుమార్, సహాయ కార్యదర్శులు కొప్పుల గట్టయ్య, కన్నెబోయిన శ్రీను, కొప్పుల రాజు, యూత్ అధ్యక్షుడిగా నక్కల రవీందర్‌లను ఎన్నుకున్నారు.

బెట్టింగ్ యాప్‌లను ఆన్‌లైన్ నుంచి తొలగించాలి

జనగామ రూరల్: బెట్టింగ్ యాప్‌లను వెంటనే ఆన్‌లైన్ నుంచి తొలగించాలని బీసీ సంక్షేమ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పండుగ హరీశ్ కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఏఓ మన్సూరికి వినతిపత్రం అందజేశారు. చిక్కుడు నాగేష్, కుమార్ యాదవ్, నీల సాంబ, రజనీకాంత్‌పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ మంజూరు

బచ్చన్నపేట: కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నిమ్మ మదన్‌మోహన్‌రెడ్డి కుమారుడు మన్విత్ ఆస్పత్రి

సంక్షిప్త సమాచారం

ఖర్చుల కోసం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రూ.7 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా శనివారం మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తన కుమారుడి చెవి సంబంధిత వ్యాధి చికిత్సకు రూ.10 లక్షలు ఖర్చవుతాయని డాక్టర్లు తెలుపడంతో ఎమ్మెల్యేను ఆశ్రయించగా రూ.7 లక్షల ఎల్ ఓసీని మంజూరు చేయించారని తెలిపారు. ఎల్‌ఓసీ మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కొడకండ్ల: ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. మార్కెట్ డైరెక్టర్‌లు దేశగాని నాగరాజు, బత్తుల వెంకన్న, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ



బచ్చన్నపేట: బండనాగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త, మాజీ కారోబార్ గొరారం కనుకయ్య(47) శనివారం మృతి చెందాడు. కాగా, పలువురు నాయకులు గ్రామానికి చేరుకుని కనుకయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, దేవస్థాన చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు. కాగా, గ్రామానికి చెందిన కొమురవెల్లి దేవస్థాన డైరెక్టర్ కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డి, మాజీ చైర్మన్ చల్ల సురేందర్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్ కొల్ల నర్సిరెడ్డి, జిల్లా నాయకులు ఇజ్జగిరి రాములు రూ. 5 వేల చొప్పున రూ. 20 వేలు, 1993–94 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.15 వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

చిల్పూరు ఆలయ అర్చకుడికి..

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరు గుట్టకు చెందిన చిల్పూరు ఆలయ అర్చకుడు సౌమిత్రి రంగాచార్యులు తల్లి అండాలు శనివారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆలయ ప్రధాన అర్చకులు రవీందర్ శర్మ, కృష్ణమాచార్యులు, ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, సిబ్బంది కుర్రెంల మోహన్, ఎస్సై నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రాజయ్య, మాజీ చైర్మన్ మూల నాగరాజు తదితరులు రంగాచార్యులును పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

కమిటీ ఎన్నిక

తరిగొప్పుల: యాదవ హక్కుల పోరాట సమితి గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు సుంకరి రవీందర్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు తాటికొండ వెంకటేష్, ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. మండల కేంద్రం కమిటీ అధ్యక్షుడిగా జల్తారు మహేందర్, ఉపాధ్యక్షుడిగా పోతరబోయిన ఎలేందర్, జనరల్ సెక్రెటరీగా మూడికె కుమార్, కాయితపల్లి గ్రామకమిటీ అధ్యక్షుడిగా కాగిత శ్రావణ్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాజకీయాల్లో మహిళల పాత్ర కీలకం

దేవరుప్పుల: కుటుంబంతోపాటు సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు రాజకీయాల్లో మహిళల పాత్ర కీలకంగా మారిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా విభాగం గ్రామ శాఖ, మండల ప్రతినిధులతో పార్టీ పురోగతిలో మహిళల పాత్రపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పాలకుర్తి ఎమ్మెల్యేగా రాణిస్తున్న యశస్వినిరెడ్డికి మద్దతుగా గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి మహిళల భాగస్వామ్యం అవసరమన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వడ్లకొండ తార, మండల మహిళా అధ్యక్షురాలు బాగాల మాలతి రెడ్డి, ఆయా గ్రామాల మహిళా అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

రక్షణ మోకులు అందజేయాలి

దేవరుప్పుల: గీత కార్మికులకు ప్రభుత్వం అందించే రక్షణ మోకులు వెంటనే అందజేయాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం దేవరుప్పుల మండలంలోని పలు గ్రామాలకు చెందిన గీత కార్మికులు ఇటీవల ప్రమాదాలకు గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా వారిని జీకేఎస్ జిల్లా బృందం పరామర్శించింది. భాస్కర్, ఉప్పునుంతల అయోధ్య, శ్రీను, నారాయణ ఉన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు



జనగామ రూరల్ : కార్మిక సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని తెలంగాణ భవన నిర్మాణ అదర్స్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ కార్మికుల జిల్లా అధ్యక్షుడు జోగు ప్రకాశ్ అన్నారు. శనివారం పట్టణ, మండలాల కార్మిక సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు హైదరాబాద్‌లో మహాధర్నాకు హాజరయ్యేందుకు వెళ్తుంటే వారిని ఎక్కడికక్కడ అరెస్టు చేయడం బాధాకరమన్నారు. వార్షిక బడ్జెట్ ఉద్యోగ, కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని, దానిని సవరించాలని అన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాండ్ర ఆనందం, హమాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గూడెల్లి రాజు, మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఇసుక తరలింపు అడ్డగింత



దేవరుప్పుల: కడవెండి వాగునుంచి పరిసరాల గ్రామాలకు అభివృద్ధి పనుల పేరిట ఇస్తున్న ఇసుక రవాణా అనుమతులపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ శనివారం అడ్డుకున్నారు. లాకావత్ తండా తదితర ప్రాంతాలకు సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరిట తహసీల్ అధికారులు ఇచ్చిన అనుమతుల మేరకు శనివారం కడవెండి వాగు నుంచి పెద్దఎత్తున ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. ఈ విషయమై గ్రామస్తులు తమ గ్రామ వాగు నుంచి ఇసుక తరలించొద్దని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ మహిపాల్‌రెడ్డితో తాటిపెల్లి మహేష్ తదితరులు ఫోన్‌లో మాట్లాడగా అనుమతి ఇచ్చామని, వాటి జోలికి పొవద్దని ఆదేశించారు.